# జీవనపథం

దేవకన్యలా గదిలో అడుగుపెట్టింది జలంధర. రెండు క్షణాల పాటు రెప్పవాల్చకుండా చూస్తూండిపోయాడు కృష్ణమోహన్. ఆమె సిగ్గుల మొగ్గ అయిపోయింది. కలుసుకున్న ఆ రెండుజతల నేత్రాలు కాస్సేపు మూగభాషలో మునిగిపోయాయి. యేవో తియ్యని ఊహల్లో ఆ కలువ కన్నెకన్నులు బరువెక్కి మత్తుగా వాలాయి. ఎన్ని క్షణాలు అలా గడిచాయో గాని... కృష్ణ పెదవులపై మెరిసిన దరహాసస్థానంలో క్రమంగా ఒక గంభీరత ఆవరించింది. యేవో స్మృతులు అతని మస్తిష్కంలో మెదులుతున్నట్లు గోచరించింది. ఉన్నట్లుండి. "రా, జలంధరా, అలా నిల్చిపోయావేం?" అంటూ హృదయపూర్వకంగా ఆహ్వానించాడు కృష్ణమోహన్.

ఆమె మెల్లిగా అడుగులువేసింది. తాను వలచిన ప్రియుని సాన్నిధ్యంలో, పొంగివచ్చే అనురాగంతో తనసర్వస్వం అంకితంచేస్తూ అతని చరణాలకు నమస్కరించబోయింది. జలంధరను వారిస్తూ ప్రగాఢ ప్రేమతో అక్కునచేర్చుకున్నాడు కృష్ణమోహన్.

"చూడు, ధరా!" యేదో జ్ఞాపకం వచ్చినట్లు అన్నాడు. సిగ్గు తెరల్లోంచి ప్రశ్నార్థకంగా చూసింది జలంధర.

కృష్ణ చటుక్కున లేచాడు. ఆమె తెల్లబోయి చూసింది. పర్సులో భద్రంగా దాచిఉంచిన ఒక ఫోటో తీసి ఆమె చేతికి అందించాడు.

జలంధరకేమి అర్థం కాలేదు. 'ఎవరీమె? ఆయనకేమవుతుంది?.... ఈ ఫోటో ఆయనదగ్గర ఎందుకు ఉంది? . . .' ముసురుకుంటున్న ప్రశ్నలకి సమాధానం దొరకలేదామెకు. ఓపికను కూడదీసుకొని, చిరునవ్వుతో అడిగేసింది "ఎవరీమె?" "ఏం చెప్పను? నా పాలిట దేవత..." సమాధానం ఆమెకేమాత్రం తృప్తినీయలేదు. "అంటే?" భృకుటి ముడిచి అన్నది జలంధర, "చూశావా! నీలో యేవో కల్లోలం బయలుదేరింది కదూ?" నవ్వుతూ అన్నాడు కృష్ణ.

జలంధర నిర్మలంగా నవ్వింది. "లేదండీ! ఏదో ఆలోచనలో ఉన్నాను ..ఇంతకీ ఈమె ఫోటో నాకు ఇంత ప్రత్యేకంగా చూపించడానికి కారణమేమిటి?" కుతూహలంతో అతనివైపు చూస్తూ అంది.

కృష్ణ చిన్నగా నవ్వాడు. "అవును, ధరా! నీ మనస్సు నాకు తెలుసు నీ నిష్కల్మషహృదయానికే వలచి చేపట్టాను. అదే నా అదృష్టంగా భావించాను...ఇంతకూ ఈ స్త్రీమూర్తి ఎవరనికదా నీ సందేహం? నీకు ఈ రోజే తెలియజెప్పాలని నిశ్చయించుకున్నాను... ఈమె పేరు నిర్మల. అజ్ఞానంలో కూరుకుపోయిన నన్ను వెలికి తీసి మెరుగులు దిద్దిన అనురాగమయి. చీకటిబాటలో దారితప్పి తడువుకునే నాకు జ్ఞానోదయం కల్గించిన తేజోరాశిగా ఈమెను యేనాడూ మరువలేను, ధరా! ... ఏదో నాటక ప్రసంగంలాగా మాట్లాడుతున్నానేమో కదూ?" ఆగిపోయాడతను.

"లేదండీ ఆపివేశారే? ఆమెను గూర్చి తెలిసికోవాలని ఆసక్తి కలుగుతూంది. చెప్పండి" అన్నది ఆత్రంగా.

"తొందరపడకు మరి, నా జీవితపథం ఊహాకందని మలుపు తిరిగిన ఘట్టమిది. విను ఇక."

"తప్పకుండా వింటాను, చెప్పండి!" అన్నట్లు ఆత్రంగా చూశాయి ఆమె కళ్ళు.

ఏదో స్వప్నలోకంలో ఉన్నట్లు, దిండుపై ఒరిగి చెప్పసాగాడు కృష్ణ. భర్త పక్కనే కూర్చుని వింటోంది జలంధర, తేజోవంతమైన అతని ముఖంలోకి చూస్తూ.

"అప్పుడు నేను తొమ్మిదవ తరగతి అనుకుంటాను — చదువుతుండేవాణ్ణి: నాకు కనీసం మా అమ్మను చూసిన గుర్తయినా లేదు. నాన్న మరో పెళ్ళి చేసుకున్నారు. ఒక స్త్రీ మూర్తిలో కారణం లేని అంత కక్ష దాగి ఉంటుందని అప్పటిదాకా నే నెరగను... అయినా ఆమెకు నాపై మమత ఎందుకు ఉంటుంది? అప్పటినుంచి అనురాగంతో చేరదీసే నాన్న ఆప్యాయత కూడా క్రమంగా కరువైపోయింది నాకూ, అన్నయ్యకు.

"మీకు అన్నయ్య ఉన్నారా?" ఆశ్చర్యంతో ప్రశ్నించింది జలంధర.

"ఉన్నాడు...కాదు, ఉండేవాడు. పాపం, ఎంత సున్నిత హృదయుడో! మా పిన్ని పోరు పడలేక ఇల్లువదిలి వెళ్ళిపోయాడు. ఏమైనాడో జాడ తెలియలేదు. శాంతి, స్వేచ్ఛా, మమతా కరువైన ఇంట్లో, నా మనస్సే నాకు ఎదురుతిరిగింది. ఒంటిఛాయలే అసహ్యించుకునే స్థితికి వచ్చాను. ఆదరంగా పిలిచి అన్నం తినిపించినవారు లేరు. నాకు అమ్మ ఉంటే బాగుండును అనిపించేది." కృష్ణ కన్నులు చూచి జాలి పడింది జలంధర.

"మీ హృదయానికి బాధకలుగుతుంది పోనీండి, మరోరోజు చెబుదురుగాని!" అంది అతనితల నిమురుతూ.

గతమంతా పరిగెత్తే చిత్రాల్లాగా కళ్ళముందు తాండవిస్తూంది అతనికి. "కాదు, ధరా! నే నేమిటో నీవు తెలిసివుండాలి. జీవితపథంలో సహయాత్రికులంగా కలుసుకున్నాము నీకీవేళ నా గతమంతా చెప్పాలను కున్నాను...ఎప్పుడో ఉబుసుపోక నా జీవితాన్ని కథగా వ్రాసుకున్న కాగితాలు ఉన్నాయి. చదువుతావా, జలంధరా?" అంటూ లేచి పెట్టెఅడుగు నుంచి కొన్ని కాగితాలు తెచ్చి అందించాడు కృష్ణమోహన్.

మనోమోహనమైన వసంత శోభ అంతా తానే పుణికిపుచ్చు కొన్నట్లున్న ఆ పార్కులో పాటలువింటూ, తన్మయత్వం చెందుతూంది నిర్మల. అందాలుచిందే తన వర్చస్సుతో తోటకే ఆమె ఒక అందంగా తోచింది.... అలాఎంత సేపు గడిచిందో! సంజ చీకట్లు వ్యాపిస్తున్నాయి. ఉలిక్కిపడి లేచి నిల్చుంది నిర్మల, ఇంటి ముఖంపట్టింది.

పడిపడిగా అడుగులువేస్తూ నడుస్తున్న నిర్మలకు తనవెనుక యేదో "ష్—ష్" శబ్దం వినవచ్చి తత్తరపడింది. 'ఎవరన్నా రౌడీలు వెంబడించ డంలేదు కదా?'

ఆమె తలవంచి నడక సాగించింది. మళ్ళీ అదేధ్వని. కలవర పాటుతో ఒకసారి తల త్రిప్పిచూసింది. ఎవడో తనవెనకే వస్తున్నాడు. చూస్తే సుమారు 14 సంవత్సరాల అబ్బాయిలా ఉన్నాడు. నిర్మలనుచూసి అదేశబ్దంచేస్తూ, అదోలా పళ్ళికిలించాడు. ఈకుర్రవాణ్ణి చూసి, తన అకారణ మైన భయానికి లోలోపల నవ్వుకుంది నిర్మల. ఆలోచనల్లో మునిగిపోయి మళ్ళీ నడకసాగించింది. అతగాడి శబ్దం ఇప్పుడు దాపుగా వినవచ్చింది.

ఆమె బిత్తరపోయి వెనక్కి జూసింది. తన వెనకేవస్తూ, ఆ కుర్రవాడు ఏవో వెకిలిచేష్టలు చేస్తూ కన్నుకొట్టాడు. అతన్ని ఏమనాలో అర్థం కాలేదామెకు.

'తనవయస్సెంత అతడెంత, తనకిపద్దెనిమిది సంవత్సరాలున్నాయి. ఉంటేగింటే తన ఈడుగల అక్క ఉండాలతనికి. అబ్బ! ఎంత తుంటరి తనం!...'అనుకుంది. ఎలానో ఇల్లుచేరింది.

ఇంటికి వెళ్ళినా పదేపదే ఆ సంఘటనే ఆమె మనఃపథంలో మెరవ సాగింది. ఎందుకో అతనిపై అసహ్యం క్రమంగా మాయమైపోతూంది. 'ఇంత చిన్నతనంలో అంత స్వేచ్ఛాచారం ఎందుకు అలవడుతుంది?... తన తమ్ముడు బ్రతికిఉంటే ఆ ఈడే ఉండేవాడు...' ఏవో పాతజ్ఞాపకాలతో అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

కాలచక్రంలో మరోరెండు రోజులు తిరిగిపోయినాయి.

ఆసాయంత్రం సినిమాప్రోగ్రామ్ వేసుకుని, స్నేహితురాలు వీణ వచ్చింది. ఆమెకూడా తనతోపాటు బి. ఎ. చదువుతూంది. ఇద్దరూ కలిసి మొదటి ఆటకు వెళ్ళారు.

సినిమాలో లీనమైపోయి చూస్తున్న నిర్మలకు ఎవరో తనచేతిని గిల్లినట్లయింది. చేయివిదిలించుకుని, గట్టిగా అరవబోయి సంబాళించుకుంది. పక్కనే మసకచీకటిలో అదే పోకిరీరూపం లీలగా కనిపించింది.. అతడే మళ్ళీ!...ఆపైన ఎంత యత్నించినా నిర్మల సినిమా చూడలేకపోయింది.

ఇంటర్వెల్లో లైట్లు వెలిగాయి. అసహ్యాకరమైన నవ్వుతో పక్కనేకూర్చుని తన్ను ఎగాదిగా చూస్తున్నాడు. 'ఛీ! ఎంత ధైర్యం!'

ఈడ్చి ఒక్క చెప్పుదెబ్బ వెయ్యాలనిపించింది. కానీ, తమాయించుకుని, ఇప్పుడిది కాదు మార్గం అనుకొంది... చటుక్కున లేచి. "వీణా! ఇక పోదామే. తలనొప్పి వస్తూంది." అన్నది, బయటకు దారి తీస్తూనే. అర్థం కానట్టు చూసింది వీణ, ఆమెను అనుసరిస్తూనే.

రిక్షాలో కూర్చున్నాక, జరిగిన విషయమంతా వివరించింది నిర్మల. వీణ అంతా విని నోరుచప్పరించింది. "ఆఁ ఎవడో రౌడీ వెధవ! అందులో భయపడేదేముంది? గట్టిగా మందలిస్తే నోరు మూసుకునేవాడుగా!"

"పోనీలే అనిపించిందే. అసలు, వాడెంతున్నాడో గమనించావా? తనేం చేస్తున్నాడో తనకు తెలుసంటావా! ఏదో ఉడుకుతనం చేసి. సంతోషించటం తప్ప..."

"ఏడ్చినట్లే ఉంది నీ వేదాంతం! ఇలాంటి వెధవల మీదనా సానుభూతి? తీసుకువెళ్ళి బాగా బుద్ధిచెప్పాలి. లేదంటావా, పోలీసుస్టేషన్‌లో ఒప్పగించాలి." కోపంగా అంటున్న వీణ మాటలు వింటూ ఊరుకుంది నిర్మల. ఇల్లు చేరుకున్నారు.

భోజనం చేసి పడుకుంది నిర్మల. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?—ఇతరులను బాధిస్తూ ఆనందించటం ఎలా అలవడుతుంది? అంత చిన్నతనంలో ఈ దుండగమూ, అపమార్గమూ ఎందుకు అబ్బుతాయి... ఆతనికి ఏ విధంగా బుద్ధి చెప్పాలి?... ఆలోచనల్లో సతమతమౌతుంటే, నిద్ర పట్టింది నిర్మలకు.

మరునాడు సాయంత్రం కాలేజీనించి వచ్చింది నిర్మల. కాసేపు మనశ్శాంతిగా పార్కుకు వెళ్లాలనుకుంది. వాకిట్లోకి వచ్చేసరికి మళ్ళీ సాషా

త్కారం! ఇప్పుడు తన ఇంటిముందే! అదే వెకిలినవ్వు. వెటకారం, కన్ను గీటటం.... ఒక్క క్షణం నిశ్చలంగా నిలిచిపోయింది నిర్మల.

"ఏమ్, బాబూ, ఇటురా!" అప్రయత్నంగా అతన్ని పిలిచింది, దృఢమైన స్వరంతో. ఈ అనుకోని పిలుపుకు అతను స్తబ్ధుడై పోయాడు పారిపోవాలనిపించింది. క్షణం పాటు ఆమెవంక సందేహంగా చూశాడు. మెల్లిగా వంకరనడకలతో ఆమెను సమీపించి, "ఏమిటి?" అన్నాడు. ఆ కంఠంలో పోతపోసిన పొగరు ధ్వనిస్తూంది.

"నువ్వు డిటెక్టివ్ నవలలూ, సెక్స్ పుస్తకాలూ బాగా చదువుతావా?" సహజధోరణిలో, మృదువుగా ప్రశ్నించింది నిర్మల, అతని చేతిలో అదేదో పుస్తకం వంక చూస్తూ.

"అవును. నీకు కూడా కావాలా? పైసలియ్యి. కిరాయికి తెచ్చిస్తా." దురుసుగా వచ్చే ఈ మాటలతోనే నిర్మల అతని వాతావరణాన్ని, పరిస్థితుల్ని అర్థం చేసుకుంది.

"నేనంటే నీకిష్టమేనా?" తేలిగ్గా నవ్వుతూ అడిగింది నిర్మల.

ఇదేం ప్రశ్న? అన్నట్టు తల ఎగరేసి; శూన్యంగా చూస్తూ, ఏదో గొణుక్కున్నాడతను.

"ఇంతకూ నీ పేరేమిటి?" మళ్ళీ అడిగింది నిర్మల, చెరగనినవ్వుతో. ఆమెలో పట్టుదల హెచ్చింది.

"ఎందుకు?... నా పేరు మోహన్. మరి నీపేరో?" నీ లెక్క ఏమిటి అన్నట్లుంది అతని స్వరం.

"నాపేరు నిర్మల...నీకు మంచే తెలుసుగా!" అతడు ఆశ్చర్యంగా చూశాడు ఆమెవైపు. ఆమె మళ్ళీ అడిగింది. "మరి నువ్వేం చదువుతున్నావు?"

"సెకన్‌క్లాసు...సరేగాని, నన్నెందుకు పిలిచావు?" 'చెబితేచెప్పు నేను వెళ్ళాలి' అనే వాలకంతో అన్నాడు.

"నీతో మాట్లాడాలనిపించింది; అందుకే పిల్చాను."

"బుక్స్ అక్కరలేదా?... పోన్లేగాని, నాకు మంచినీళ్ళియ్యి." జబర్దస్తీగా అడిగాడు.

"మరి లోపలికిరా! మంచినీళ్ళు తాగిపోదువుగాని." ఆమె కంఠంలో ఆదరం ధ్వనించింది.

"ఊహుఁ. బయటికి తెచ్చిఇవ్వు. దాహమవుతోంది."

"అలాగేకాని, మా ఇంట్లోకి ఎందుకు రావు?"

"మీ వాళ్ళతో చెప్పికొట్టించాలనా?"

"అదేమిటి, బాబూ! మావాళ్ళెవ్వరూ అలా చెయ్యరు. . . . అయినా నీవేం తప్పు చేశావ్?"

మనస్సులో ఏదో ఆందోళన చెలరేగినట్లు తల వంచుకున్నాడతను.

"చూడు, బాబూ! మంచినీళ్ళు తాగి, పబ్లిక్‌గార్డెన్‌దాకా నాకుతోడు వస్తావా?" ఆ మాటల్లోని మృదుత్వానికి అతని అనుమానాలన్నీ పటాపంచలు అయిపోయాయి. ఆమె ముఖంలో తోచిన ఆప్యాయితకు అతడెలానో అయిపోయినాడు. కళ్ళు బరువుగా వాలాయి. "అలాగే" అన్నాడు.

నిర్మల అందించిన చల్లని నీరు తాగి, మాటాడక ఆమెననుసరించాడు మోహన్.

నగం దూరం వరకూ ఇద్దరూ మౌనంగా నడిచారు. ఒక ఇరవైఏళ్ళ యువకుడు సైకిల్ మీద ఎదురుగా వస్తున్నాడు. మోహన్‌నుచూచి, "హలో విష్ యూ ది బెస్ట్ ఆఫ్ లక్! టా...టా .." అంటూ పళ్ళికిలించి దాటిపోయాడు. మోహన్ ఏమీ మాటాడలేదు. మొదటిసారిగా తానేదో తప్పు చేస్తున్నానేమో అనే భావం అతనిలో కలిగింది.

"ఛీ!" అని లోలోపల అసహ్యించుకొన్న నిర్మల గంభీరంగా అడిగింది

"అతనెవరు?"

"వాడా? నా ఫ్రెండ్!" అనుమానిస్తూ అన్నాడు మోహన్ తల వంచుకుని.

నిర్మల ఆశ్చర్యపడింది. 'పధ్నాలుగేళ్ళ బాలుడికి ఇరవైఏళ్ళ వాడితో స్నేహమా?' అనుకుంది. "అతడు నీకు స్నేహితుడా?"

"అవును. నాకు వాడే బుక్స్ తెచ్చి ఇస్తాడు చదవడానికి. మా గ్రూపుకి వాడొక లీడర్ కూడాను," తూచితూచి అన్నాడు మోహన్.

గార్డెన్‌లో ఒక చల్లటి మడిలో కూర్చున్నారు. నిర్మలపట్ల అతని హృదయం ఏదో ఒక అవ్యక్త అభిమానంతో నిండిపోయింది. ఏ స్త్రీ వైపు చూసినా ఎన్నడూ తనకు గౌరవభావమే లేదు. . . .ఈమె ఎవరో ఈమెలో ఏదో ప్రత్యేకత. తనపై ఇంత ఆదరణ చూపటమేమిటి? తాను అమ్మను ఎరగడు. ఇంకే స్త్రీమూర్తికి సన్నిహితంగా ఉండి, అనురాగ పూరితమైన ఒక్క అనునయవాక్యాన్నైనా నోచుకోలేదు. కేవలం తనపై వచ్చే నిందలూ, ఆరోపణలూ తప్ప మరేమీ వినలేదు. . . .ఈమె ఎదట

తన మనస్సులో ఇంత సంచలనం ఎందుకు చెలరేగుతోంది? ఆమె చల్లని మాటల్లో ఏదో ఆకర్షణ ఉంది. ఎందుకో పిన్ని అంటే హేళన, కోప భావమేగాని పూజ్యభావం ఏనాడు ఏర్పడలేదే! అసలు ఆడవాళ్ళలో కూడా మంచివాళ్ళు ఉంటారనే విషయమే తెలియలేదా తనకు? తెలియకుండానే తనలో ఏదో పరివర్తన కలుగుతూందా? ఆడవాళ్ళుకనబడితే, అర్థంలేని కొంటెచేష్టలే ఆనందానికి సాధనాలుగా ఎలా అలవడినాయో తనకు! గోపి గాడితోకూడి తనకూ ఇది ఒకసరదా అయిపోయింది ఇది మంచి, ఇది చెడూఅంటూ తానింతకుముందు ఎన్నడూ యోచనకూడా చెయ్యలేదే?.... ఇంతకూ ఈమెకు నా దుండగాలపై కోపం ఎందుకురాలేదో?"

తల వంచుకుని తన ఆలోచనల్లో మునిగితేలుతున్న మోహన్‌ను చూసి చిన్నగా నవ్వింది నిర్మల.

"చూడు, తమ్ముడూ! నేనొక మాట చెబుతాను, వింటావా?" ఆద రానురాగాలతో అతని తలనిమురుతూ అడిగింది నిర్మల.

ఉలిక్కిపడి ఆమెవంక చూశాడతను. 'ఆమె ఏమన్నది? తమ్ముడూ అనా? అబ్బ! ఎంత తియ్యని పిలుపు! ఆ స్వరంలో ఎన్ని తేనెసోనలు!" ఆశించని ఆవెచ్చని అప్యాయతలో మంచితనాన్ని ఆవరించి ఉన్న పొర కరిగిపోయింది. పొంగివచ్చే కన్నీటికి ఆనకట్ట వెయ్యలేక, మోకాళ్ళమధ్య ముఖం పెట్టుకున్నాడు మోహన్. ఈ మధురమూర్తితో తానెంత మురటుగా ప్రవర్తించాడు!

ఈ పరిణామం చూసి విస్తుపోయింది నిర్మల. మంచితనాన్ని వెలికి తీయాలని సంకల్పించింది....కాని చెడు ఇంత తొందరగా కన్నీటిధారలో కరిగిపోతుందని ఆమెకూడా అనుకోలేదు. ఆవేదనతో అన్నది, "ఛీ!

తప్పకదూ ఏడుస్తారా?...చూడమ్మా! ఇప్పుడు నిన్నేమన్నాననీ?..."
బుజ్జగించసాగింది?

కళ్ళు తుడుచుకుంటూ తలఎత్తి అమాయకంగా అడిగాడుమోహన్:
"నిన్ను అక్కా అని పిలవచ్చా?"

'ఓ! అక్కనేనీకు! తప్పకుండా అలాగేపిలు, తమ్ముడూ .. చూడు. నేను చెప్పేదొక్కటే. నీవింకా చాలా చిన్నవాడివి. ఎంతో మంచితనం నీలో నిబిడమైఉంది. దాన్ని పట్టుదలతో పోషించుకో. అమూల్యవస్తువుగా కాపాడుకో. నీతెలివితేటలు నిండుదనంతో నిన్నెంతోపైకితీసుకుపోతాయి. ఇంతకంటే ఏం చెప్పను? ఆలోచిస్తే అంతా నీకే అర్థమవుతుంది," అప్యాయంగా అతని కన్నీరు తుడుస్తూ అన్నది.

మబ్బులు విడిన ఆకాశంలా స్వచ్ఛంగాఉన్న మనసుల్తో ఇద్దరూ గృహోన్ముఖులయ్యారు. మోహన్ఎదలో ఇంకా ఏదో సంఘర్షణ చెలరేగుతూనే ఉంది. 'ఇదంతా కలా?...నిజమా?'

నిర్మల ఇల్లు వచ్చేసింది. "చూడు, బాబూ! ఇంకేమీ ఆలోచన పెట్టుకోకు. హాయిగా భోజనంచేసి పడుకో. రేపు మా యింటికి వస్తావుగదూ!"

"అలాగే, అక్కా!" ఈ కొత్తసంబోధనలోని మధురిమ నాస్వాదిస్తూ ఇంటిదారి పట్టాడు మోహన్. ప్రశాంత చిత్తంతో లోనికి వెళ్ళింది నిర్మల.

○ ○ ○ ○ ○

మనిషిపడే బాధలతో, సుఖాలతో తనకు నిమిత్తంలేనట్లు కాలవాహిని ప్రవహించి పోతూంది. ఆ వాహినిలో మరిరెండు వసంతాలు దొర్లిపోయినాయి.

బాలభాస్కరుని లేతకిరణాలు జగత్తును శోభాయామానం చేస్తున్నాయి. లోకం అప్పుడప్పుడే నిద్రనుంచి మేల్కొంటోంది. గృహకృత్యాల్లో మునిగిఉన్న నిర్మలకు తలుపుతట్టిన చప్పుడు వినిపించింది.

తలుపు తెరిచేసరికి, చిందులుతొక్కే ఉత్సాహంతో మోహన్ ప్రత్యక్షం. చేతిలో పేపరుఉంది. "అక్కా, అక్కా! నీ చలవేనక్కా.."

"ఏమిట్రా, తమ్ముడూ! ఏమిటీ హడావిడి? రిజల్ట్సు వచ్చాయా?"

"అవునక్కా! హెచ్. ఎస్. సి. పాసయ్యాను, ఫస్టుక్లాసులో" నిర్మల పాదాలపైపు వంగాడు మోహన్. రెండు కవోష్ణ బాష్పబిందువులు ఆమెపాదలపైరాలాయి. నిర్మల ఆనందానికి మేరలేదు.

"అబ్బో! ఎంత శుభవార్త! ఇంకా పైకిరావాలి. ఇంకెన్నో విజయాలు పొందాలితమ్ముడూ!" ఆమె ఎదలో ఎనలేని ఉత్సాహం పరవళ్ళు తొక్కింది. "చూడు, తమ్ముడూ! ఈ పూట అక్కచేత్తో అన్నం తినాలి. వస్తావుకదూ!" అతని భుజం తట్టుతూ అన్నది నిర్మల.

"నీ అనురాగానికి అంతులేదా, అక్కా?"

"ఏమిట్రానువ్వు! నాటకంలో డైలాగ్స్ కొట్టకు. ఇది వాస్తవిక జీవితం, మరి...అన్నట్టు, కాఫీకూడా రెడీగాఉంది. తాగి వెళ్ళుదువుగాని, ఉండు" రెండు నిమిషాల్లో కాఫీవెచ్చబెట్టి ఇచ్చింది అక్క.

"బావగారింకా లేవలేదుగా! నువ్వు చెప్పు, అక్కా? నేను మళ్ళీ పదిగంటలకల్లా వస్తాను" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు మోహన్.

గత సంఘటనలన్నీ ఆమె హృదయాంతరాళంలో మెరిశాయి. మెల్లిగావెళ్ళి భర్తగారికి మేల్కొలుపు పాడింది నిర్మల.

ప్రక్కకి ఒత్తిగిల్లుతూ 'అప్పుడేనా?' అన్నాడు విశ్వం.

"తమ్ముడు హెచ్. ఎస్. సి. పాసయ్యాడు, తెలుసా?" గర్వంగా అన్నది.

"యేమిటి!" అమాంతం లేచి కూర్చున్నాడు విశ్వం. "శ్రీహరా ఇంకేం! ముందు నీ కోలాహలం పట్టలేమిక! అసలు నీ ఆదరణ ఉన్నచోట అపజయం ఉంటుందా, మరి?". ఆమె సిగ్గుతో తల వంచుకుంది. మళ్ళీ అన్నాడు. "ఇంతకీ ఇవాళ విందుభోజనమన్నమాట. అంతేనా... అయితే తొందరగా లేవాలి, మరి." నిర్మలదరహాసం కురుస్తుంటే పక్కమీదినుంచి లేచాడు విశ్వం.

సంవత్సరంన్నర దాటింది వారివివాహం అయి. నిర్మల ప్రశాంత హృదయానికి విశ్వమంత విశాలహృదయంతో పొందుకలిగింది. ఆ అనురాగఫలం కూడా త్వరలోనే ఉదయించే తరుణం దగ్గిరపడింది.

మోహన్ ఆ ఇంట్లో సర్వస్వతంత్రుడు. అక్కా, బావా అంటూ ఇద్దరికీ తలలో నాలుకలాగా తిరుగుతుంటాడు. వాళ్ళకు సంతృప్తి కలిగేలాగా జీవితం సరిదిద్దుకుంటూ వికాసంసాధించడమే అతని లక్ష్యంగా మారిపోయింది.

పదిగంటలయ్యేసరికి, హుషారుగా కూనిరాగాలుతీస్తూ వచ్చాడు మోహన్. రెండు మూడు పిండి వంటలతోసహా కంచంలో నిర్మల వడ్డిస్తూంటే, నొచ్చుకుంటూ అన్నాడుమోహన్; "ఏమిటక్కా! నువ్వసలే మనిషివి. ఒంటరిదానివి. అసలేనీరసంగా ఉన్నావు. ఇంతపని పెట్టుకున్నావు నువ్వింత శ్రమపడటం నాకుసంతోషమనుకున్నావా? నీచేత్తో నీళ్ళుతాగినా నాకు అమృతతుల్యం కాదా, అక్కా!"

"పోనీలేవయ్యా! నీ పేరుతోనైనా మాకు కడుపారా విందు దొరికింది. నీకు ధన్యవాదాలు, నాకు అభినందనలు!" సరసంగా నిర్మల వైపు చూస్తూ అన్నాడు విశ్వం,

"ఊఁ, పాపం! రోజూ ఉపవాసం చేస్తున్నట్టే! ఎంత కష్టంవచ్చిందీ!" నవ్వుతూ అన్నది నిర్మల.

"బావగారి సరసాలకేం గాని నువ్వుకూడా వడ్డించేసుకో, అక్కా అంతా కలసి భోజనం చేద్దాం" మోహన్ అన్నాడు.

"అవును, నిర్మలా! వడ్డించేసుకో."

పార్వతీ పరమేశ్వరుల్లాగా ఎదట కూర్చున్న అనురాగమూర్తులైన ఆ దంపతులకు మనస్సులోనే నమస్కరించాడు మోహన్. ఈ ఆప్యాయతలో బలమేగదా బ్రతుకుబాటలో తనను దారి తప్పకుండా, భుజంతట్టి ముందుకు నడిపిస్తోంది. లడ్డూ చేతిలోపట్టుకుని ఒక్కక్షణం అలానే చూస్తూ ఉండిపోయిన మోహన్‌కు, "ఏమిటి, మోహన్! ఏమీతినటంలేదు నువ్వు." అంటూ ఒక్కసారిగా వినిపించిన రెండు స్వరాలు స్పృహ కల్గించాయి. చిరునవ్వుతో అన్నాడు: "ఏం లేదక్కా! చాలా సంతోషంగా ఉంది." స్వరం గద్గదికంగా వినిపించింది.

భోజనం పూర్తిఅయింది. చేయి తుడుచుకుంటూ ప్రశ్నించాడు విశ్వం. "కాలేజీలో సీటుకు అప్లికేషన్ పంపావా?"

"పంపుతున్నాను బావగారు! మీ ఆశీస్సులతో కాలేజీ చదువు కూడా విజయవంతంగా ముగించాలని ఉంది". అంటూ మోహన్ సెలవు తీసుకున్నాడు. విశ్వం, నిర్మల వాత్సల్యం పొంగివచ్చే మనసులతో

తలన్ని వెయ్యివిధాల దీవించుకున్నారు. రోడ్డుమీద నడిచే మోహన్ మస్తిష్కంలో' 'ఈఅనురాగమూర్తుల ఋణంఎప్పుడుఎలాతీర్చుకోగలనో,' అనే భావన ఉయ్యాలలూగుతూంది.

చదవడం ముగించింది జలంధర. తలఎత్తి భర్తవంక చూసింది, తనవేపు రెప్పవేయకుండా చూస్తున్నాడు. అడుగుతుంటే ఆమె బుగ్గల్లో గులాబీలు పూచాయి. "ఈ మోహన్ ఎవరు? ఎక్కడున్నాడిప్పుడు?"

"నేనే! ఇక్కడే, నీ సాన్నిధ్యంలో ఉన్నాను" అంటూ బుగ్గమీద చిటికె వేశాడు కృష్ణ.

''అదే అనుకున్నాను . . .ఇంతకూ ఈవిడ ఇప్పుడెక్కడ ఉన్నారండీ?'' ఆసక్తి, ఆప్యాయత ఆమె స్వరంలో ఒక్కుమ్మడిగాధ్వనించాయి.

ఈ ప్రశ్నతో కృష్ణమోహన్ ముఖం వివర్ణమైపోయింది. తలఎత్తి చెయ్యి పైకి చూపించాడు, 'దేవుని సాన్నిధ్యంలో'' అన్నట్లు. ముత్యాల్లాగా రెండు కన్నీటిబిందువులు అతని చెక్కిళ్ళపై దొర్లివచ్చాయి.

జలంధర కంగారుపడింది. '' మీ మనస్సుకు బాధ కలిగించాను క్షమించండి.!'' అంటూ కొంగుతో చెక్కిళ్ళు అద్దింది.

''లేదు, ధరా! కథ ముగిసింది. శేషం కొంచెం ఉంది. విను. పై సంఘటన అనంతరం కొద్దిమాసాలకే ప్రసూతి ఆస్పత్రిలో అక్కడర్నీ వదిలిపెట్టి శాశ్వతంగా కన్ను మూసింది. మంచివారికి మనుగడ ఎక్కువఉండదేమో!...ఆ అమృతహృదయ లేకపోతే యేనాడో పతనమై ఉండేవాణ్ణి. నాలో జ్యోతి వెలిగించి మా బావగారితో రెండు సంవత్స

రాల మధురస్మృతులు మాత్రం మిగిల్చి ఈ లోకంనుంచి శాశ్వతంగా నిష్క్రమించింది. నాకు తనఋణం తీర్చుకునే అవకాశం కూడా ప్రసాదించలేదు. అతని కంఠం గద్గదికమై పోయింది. ముగించాడు.

"మరి మీ బావగారు?"

గాఢంగా నిట్టూర్చి కొనసాగించాడు కృష్ణ, "ఎక్కడి బావగారు! అంత గాఢమైన అనురాగంలో అక్కలేకుండా జీవించి ఉండగలడా? సంవత్సరం తిరిగి రాకముందే మంచంపట్టి మాయమైపోయాడు. ఇద్దరూ నాజీవితంలో మెరుపులాగా మెరిసి అదృశ్యమైపోయారు. జీవనపథంలో మలుపు తిప్పి మంచిచూపి పోయారు. మరోసారి బ్రతుకుబాటపై అంధకారం ఆవరించినట్లయింది.' జలంధర తల నిమురుతూ ఒక్కక్షణమాగి మళ్ళీ అన్నాడు; కాని, నీ సాన్నిహిత్యంలో మరో క్రొత్త మజిలీ ప్రారంభమైంది. మళ్ళీనూనె పోసి ఈ జ్యోతిని దీప్తివంతంచేశావు. కాలేజీలో కలిసికొన్న నాడే నా బ్రతుకుబాటలో సహధర్మచారిణివై తోడు దొరికావు . . . . ఏమైనా ప్రేమమయులైన ఇరువురు స్త్రీ మూర్తులు మోడువారిన నా జీవితంలో అనురాగం పండించి నన్నొక మానవుడిగా నిలబెట్టారు ధరా! ఇదేనా మలుపు తిరిగిన జీవితం."

"కృష్ణా" అంటూ ఆరాధనాపూర్వకంగా అతని భుజంపై వాలింది జలంధర.

(5-11-69 ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక)